## క్లుప్తంగా

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**10న సహస్ర తులసిపూజ**

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 10న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

### నేడు సేవా కార్యక్రమాలు

డాబాగార్డెన్స్ : సూపర్‌స్టార్ ప్రిన్స్ మహేష్ బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు విశాఖ సిటీవైడ్ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ (సరస్వతీ పార్క్) ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కింగ్‌జార్జ్ ఆసుపత్రి పిల్లల వార్డులో చిన్నారుల సమక్షంలో కేక్ కటింగ్, అనంతరం పిల్లలకు పాలు, పండ్లు, రొట్టెలు అందజేయనున్నట్టు చెప్పారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు జిల్లా పరిషత్ సమీపాన గల అమెరికన్ ఆసుపత్రి ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్లు, పాలు, రొట్టెల పంపిణీ, ఉదయం 10 గంటలకు జగదాంబ జంక్షన్ సమీపాన రోటరీబ్లడ్ బ్యాంక్‌లో ప్రిన్స్ మహేష్‌బాబు అభిమానుల రక్తదాన శిబిరం నిర్వహించనున్నారని, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

### చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి

బీచ్ రోడ్డు: రోడ్డు ప్రమాదంలో ఈ నెల 5న తీవ్ర గాయాలు పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం రాత్రి మరణించాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాబాగార్డెన్స్‌కు చెందిన నవీన్ (21) తన స్నేహితులతో కలిసి 5న అర్ధరాత్రి పెట్రోల్ కోసం స్పెన్సర్ దగ్గర ఉన్న పెట్రోల్ బంకుకు వెళ్లాడు. ఆ సమయంలో రోడ్డు క్రాస్ చేస్తున్న నవీన్‌ను ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో నవీన్ సోమవారం రాత్రి మరణించినట్టు పోలీసులు తెలిపారు.

### దిగివచ్చిన టమాటా ధరలు



నరసింహనగర్ రైతుబజార్‌లో టమాటాలు

సీతంపేట: సుమారు నెలరోజులు పాటు ఆకాశాన్నంటిన టమాటా ధరలు ఎట్టకేలకు దిగి వచ్చాయి. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం ఒక రకం టమాటా కిలో రూ.84, చిన్న రకం టమాటా కిలో రూ. 60లకు విక్రయించారు. గత నెలలో రైతుబజార్‌లో కిలో రూ.130కి, బహిరంగ మార్కెట్‌లో కిలో 200 వరకు ధర పలికింది. పెరిగిన ధరలతో వినియోగదారులు బెంబేలెత్తిపోయారు. ధరల నియంత్రణకు ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుల నుంచి టమాటాలు సేకరించి సబ్సిడీ ధరపై కిలో రూ.50 చొప్పున విక్రయాలు చేపట్టింది. దీంతో కొంత వరకు ధరలు అదుపులోకి రాగా, ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లి మార్కెట్‌కు టమాటా సరుకు పెద్దఎత్తున రావడంతో ఒకేసారి ధర తగ్గుముఖం పట్టింది. ధర ఒకేసారి తగ్గడంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు. బజారుకు 70 క్రేట్ల టమాటా రావడంతో జోరుగా విక్రయాలు జరిగాయి. మరో వారం రోజుల్లో క్రమేణా ధర తగ్గే అవకాశం ఉందని బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు తెలిపారు.



# అభివృద్ధికి చిరునామా.. సీఎం జగన్ పాలన

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలోనే అభివృద్ధి
- రూ. కోటి పదిహేను లక్షలతో రోడ్ల నిర్మాణం

జగదాంబ : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని జీవీఎంసీ 35 వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ క్రికెట్ స్టేడియం చుట్టూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. కోటీ పదిహేను లక్షలతో రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. అనేక సంవత్సరాలుగా గతుకులమయంగా ఉన్న పూర్ణామార్కెట్ రోడ్డు, బౌడారా రోడ్డు, వీధుల్లో సీసీ రోడ్లు వేశామన్నారు. వార్డుల్లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్‌సీపీ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద జరుగుతున్న రహదారి నిర్మాణం

### పదిహేనేళ్ల తర్వాత మళ్లీ రోడ్డు..



సుమారు పదిహేనేళ్ల తర్వాత రహదారులకు మోక్షం కలిగింది. స్టేడియం చుట్టు ఉన్న రోడ్డు ఏవీఎన్ కళాశాల డౌన్ నుంచి వచ్చే వారికి, పోర్టుకి వెళ్లే వారికి, పాతనగరానికి చెందిన వాహన చోదకులకు అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. టీడీపీ పాలన కాలంలో కనీసం మరమ్మతులు చేయలేదు. ఇప్పుడు ఏకంగా నూతన రహదారి నిర్మించనుండటం సంతోషకరం.

–పటాన్ ఖాజావలీ, మున్సిపల్ స్టేడియం దగ్గర వ్యాపారి

### పాతనగరానికి కొత్త కళ..



రహదారుల నిర్మాణంతో పాత నగరానికి కొత్త కళ వస్తోంది. ఇక్కడ గతంలో రహదారులు గతుకులమయంగా ఉండేవి. దీంతో మేమంతా చాలా ఇబ్బందులు పడేవాళ్లం. జీవీఎంసీ 35వ వార్డులోని పూర్ణామార్కెట్, మున్సిపల్ స్టేడియం చుట్టుపక్కల ప్రాంతాలకు సత్వరావసరం అయిన రహదారులు నిర్మిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతానికి నూతన కళ వస్తోంది.

– సత్యనారాయణ, ఏవీఎన్ కళాశాల డౌన్, మంచాలవీధి వ్యాపారి

### అభివృద్ధిపథంలో రాష్ట్రం..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారు. ఎక్కడ ఏది అవసరమో అక్కడ అవి ఏర్పాటు చేస్తున్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. 99 సంక్షేమ పథకాలకు పైగా అందిస్తున్నారు. ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి జగనన్న తన హయాంలో చేసి చూపిస్తున్నారు.

–విల్లూరి భాస్కరరావు, 35వ వార్డు కార్పొరేటర్

## రామజోగిపేటలో పెట్రోల్ దొంగలు

- రాత్రి 10 దాటితే విజృంభణ
- పోలీసులు నిఘా పెట్టాలంటున్న స్థానికులు

అల్లిపురం : మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రామజోగి పేటలో గత కొంత కాలంగా పెట్రోల్ దొంగలు విజృంభిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రాత్రి 10 గంటలు దాటితే చాలు దొంగలు చెలరేగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల మీదే మద్యం తాగటం, గొడవలు పడటం చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. రాత్రివేళ రోడ్డుపై మగవారు సైతం నడవటం కష్టంగా ఉందని, దారిలో అడ్డగించి నానా గొడవ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు రోడ్డుపై అడుగు పెట్టడానికి జడిసిపోతున్నారని తెలిపారు. పోలీసులకు చెప్పినా అంతగా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఏమైనా జరిగిన తర్వాత స్పందించే కంటే ముందుగా వారిని అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి సమయాల్లో రోడ్లపై నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాల నుంచి పెట్రోలు దొంగిలిస్తున్నారని, ఉదయం లేచి చూసే సరికి పెట్రోలు పైపులు కట్ చేసి, ఊడదీసి ఉంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి పోలీస్ బీట్ ఏర్పాటు చేసి పెట్రోలు దొంగలు, ఆకతాయిల బెడద నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

## జర్నలిజం విద్యార్థులకు దిశానిర్దేశం



జర్నలిజం విభాగ విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. మీడియా రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను పలు ఉదాహరణలతో వివరించారు. జర్నలిజం కోర్సును పూర్తిచేసే సమయానికి జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలన్నారు. జర్నలిజం విభాగం నుంచి నూతన స్టార్టప్ సంస్థలు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏయూ నుంచి ప్రచురితమవుతున్న వార సంచిక ఏయూ లుక్స్ తీర్చిదిద్దడంలో యువత తమ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. విద్యార్థులు నిత్యం కొంత సమయాన్ని కేటాయిస్తూ ఏయూ లుక్స్ విస్తరణలో భాగం కావాలని ఆహ్వానించారు. విదేశీ విద్యార్థుల భాగస్వామ్యం సైతం ఎంతో కీలకమన్నారు. ఏయూ లుక్స్ సంచిక వేలాది మందికి చేరువవుతోందని, రానున్న కాలంలో మరిన్ని మార్పులు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ వినయ్‌కుమార్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు రామకృష్ణ (ఫైల్)

అల్లిపురం : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏవీఎన్ కాలేజీ దరి, రెల్లివీధికి చెందిన మంగళగిరి రామకృష్ణ (65) రాత్రి 9 గంటల ప్రాంతంలో జగదాంబ జంక్షన్ నుంచి సీఎంఆర్ షాపింగ్ మాల్ వైపు తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా సీఎంఆర్ దగ్గరకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో అతను కిందపడటంతో తలకు బలమైన గాయమయింది తీవ్ర రక్తస్రావం కావటంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అధ్యాపకులతోనే సామాజిక మార్పు



శిక్షణ పూర్తి చేసిన అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సమాజంలో మంచి మార్పులు తీసుకువచ్చే శక్తి అధ్యాపకులకు ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక అభివృద్ధికి దోహదకారిగా అధ్యాపకులు నిలవాలన్నారు. వైవిధ్యమైన జ్ఞానాన్ని కళాశాలలో విద్యార్థులకు అందించే ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థిలోని లోపాలను ఎత్తి చూపకుండా, వారిని సరిదిద్ది తగిన మార్గదర్శకం అందించేలా ఉండాలని సూచించారు. భారత్ విశ్వగురువుగా ఆవిర్భవించాలని ప్రధాని మోదీ ఆశిస్తున్నారని, ఈ దిశగా యువతను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో అనుసంధానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న 21 మంది అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

## 11 నుంచి అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కుర్తాళ పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్, మేనేజర్ కృష్ణసేన్

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితా పీఠంలో ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం నిర్వహించనున్నట్టు కుర్తాళ పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్ శర్మ తెలిపారు. మంగళవారం పీఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే మొదటిసారిగా అష్టలక్ష్మీ యాగంతో పాటు అష్టలక్ష్మీ వైభవం కూడా నిర్వహిస్తామన్నారు. అష్టలక్ష్మీ వైభవంలో మహాలక్ష్మి అమ్మవారితో పాటు ఎనిమిది రూపాల్లో అష్టలక్ష్మీలను స్థాపన చేసి రోజూ ఉదయం దేవతలకు హోమం, స్వర్ణ పుష్పార్చన, సాయంత్రం అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ నిర్వహిస్తామని తెలిపారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు పీఠంలో అష్టలక్ష్మీ కల్యాణం జరుగుతుందన్నారు. ఎక్కడైనా లక్ష్మీ నారాయణుల కల్యాణం జరిపిస్తుంటారని, కానీ లలితా పీఠంలో మాత్రం అష్టలక్ష్మీ అమ్మవార్లకు ఏకకాలంలో కల్యాణం జరిపించడం విశేషమని పేర్కొన్నారు. అధిక మాసంలో చేసే పూజలకు అధిక ఫలితం లభిస్తుందని శ్రీమహావిష్ణువు స్వయంగా లక్ష్మీదేవికి చెప్పినట్టు పురాణాల్లో ఉందన్నారు. అనంతరం యాగం వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, సన్యాసిరావు పాల్గొన్నారు.

### సత్యనారాయణకు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న కోలా గురువులు

మహారాణిపేట : విశాఖ తూర్పు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన ఎస్‌వీవీ సత్యనారాయణ మంగళవారం మద్దిలపాలెంలో ఉన్న పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అభినందించారు. సత్యనారాయణకు శాలువ కప్పి సత్కరించారు. పలువురు పార్టీ నాయకులు సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.

### వీధి విక్రయదారులకు లీడ్ బ్యాంక్ రుణాలు



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

జగదాంబ : వీధి విక్రయదారులు, చిరు వ్యాపారుల అభివృద్ధికి బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తామని లీడ్ డిస్ట్రిక్టు బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధి విక్రయదారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి పీఎం స్వానిధి పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. చిరు వ్యాపారులు, వీధి విక్రయదారులు, తోపుడు బండ్ల వ్యాపారులకు పలు విడతల్లో రుణాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, యూసీడీ ఇన్‌చార్జి పీడీ లక్ష్మి, ఏపీడీ పుణ్యవతి, డీఎంసీ నాగరాజు, వివిధ శాఖల అధికారులు రామలక్ష్మి, శైలజ, రమేష్, లలిత తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ ధ్యేయం



లక్ష్మీ టాకీస్ వద్ద వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



ఫిషింగ్ హార్బర్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత సీట్లు, కళాశాలల్లో అడ్మిషన్లు, జీవీఎంసీ శానిటేషన్ విభాగంలో ఉద్యోగాలు కోరుతూ పలు వినతులు అందాయి. అలాగే ఇళ్లు, ఇళ్ల స్థలాలు, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు కోరుతూ పలువురు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అర్జీదారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మీ దేవస్థానం పాలక మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 29వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, స్టేట్ ఫారెస్టు డైరెక్టర్ పీతలవాసు, 35వ వార్డు ప్రెసిడెంట్ అలపన కనక రెడ్డి, సౌత్‌మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోనిదేవా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**ఫిషింగ్ హార్బర్‌లో..**

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి మంగళవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా హార్బర్‌లో మత్స్యకారులు చేపలు ఎండబెట్టుకోవటానికి స్థలం కేటాయించాలని ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ విజయను కోరారు. 2018 నుంచి 2023 వరకు తుపాన్ల వలన నష్టపోయిన 36 బోట్లకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఫిషరీస్ కమిషనర్, ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డితో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ అసోసియేషన్ నాయకులు బర్రి కొండబాబు, మున్నాం బాలాజీ, కింగ్‌ఫిషర్ రాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లండా రమణ, ఆదివిష్ణు, బొగ్గు శ్యామ్, వాసుపల్లి నారాయణ, దూడ అప్పారావు, రామరాజు, చింతకాయల వాసు, అచ్యుత్, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీమద్ భాగవత సప్తాహం



కార్యక్రమానికి హాజరైన అతిథులు

డాబాగార్డెన్స్ : పాతనగరం రాజప్పనాయుడు వీధిలో గల గీతా భవనంలో శ్రీమద్ భాగవత సప్తాహం మంగళవారంతో ముగిసింది. శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు, ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి జ్యోతి ప్రజ్వలనతో ఆధ్యాత్మిక సభను ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసాచార్యులు భాగవతోత్తములను ఉద్దేశించి మాట్లాడుతూ జీవాత్మను పరమాత్మునిలో ఏకం చేయడానికి భాగవతం ఎంతో దోహదపడుతుందన్నారు. తన మధురమైన భక్తితో రుక్మిణీదేవి శ్రీకృష్ణ పరమాత్ముని పొందినట్టు భక్తులైన అందరు భగవంతుని పొందాలని ఆశీస్సులు అందజేశారు. ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ భాగవతంలో గల మధుర ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, గీతా ప్రచార సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అబద్ధాలకు హద్దు లేదా?

డాబాగార్డెన్స్ : గంగవరం పోర్టు యాజమాన్యం అబద్ధాలకు హద్దు లేదా? అని సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ చెల్లింపులు ఆలస్యమైనప్పటికీ స్టీల్‌ప్లాంట్‌కు సక్రమంగా దిగుమతులు అందించామని ఈ నెల 5వ తేదీన పోర్టు యాజమాన్యం చేసిన ప్రకటన అవాస్తవమన్నారు. సిటు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో నరసింగరావు మాట్లాడుతూ గంగవరం పోర్టులో జూలై చివరి వారంలో వెయ్యి కోట్ల విలువైన కోకింగ్ కోల్‌తో వచ్చిన నౌకలకు 24 గంటల్లోగా బెర్త్‌లు ఇవ్వాల్సి ఉండగా దాదాపు వారం రోజులకు బెర్త్ ఇచ్చారని తెలిపారు. దీనిపై దేశమంతా భగ్గుమందన్నారు. కానీ పోర్టు యాజమాన్యం స్టీల్‌ప్లాంట్ దిగుమతులు సక్రమంగా చేసినట్టు నంగనాచి కబుర్లు చెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మోపిన అదనపు భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విజయనగరంలోని గర్భాం మాంగనీస్ గనులు, సరిపల్లి వద్ద ఉన్న ఇసుక గనులు, అనకాపల్లిలోని కింతాడ గనులు, క్వార్ట్జ్ గనుల లీజులు ప్రతి సంవత్సరం రెన్యువల్ జరగాల్సి ఉన్నప్పటికీ రెన్యువల్ పొడగించకపోవడం దారుణమన్నారు. తక్షణమే లీజులు రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యు. రామస్వామి, ఆర్‌కేఎస్‌వీ కుమార్, కేఎం శ్రీనివాస్‌పాల్గొన్నారు.

### మెరిట్ ఉన్న వారికే ఉద్యోగాలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ఇటీవల విశాఖ ఉమ్మడి జిల్లా పరిధిలో నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని కొందరు వ్యక్తులు వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలాది రూపాయలు వసూలు చేసి వారికి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నాయని, నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంలతోపాటు ఏ కేడర్ ఉద్యోగాలు అయినా సంబంధిత కోర్సులో వచ్చిన మార్కుల ఆధారంగానే నియామకాలు చేపడతామని పేర్కొన్నారు. మరే ఇతర మార్గాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం లేదని, అందువల్ల ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చెప్పి డబ్బులు వసూలు చేసేవారి పట్ల అప్రమతంగా ఉండాలని కోరారు.

## గంబూసియా చేపలతో దోమల నివారణ



బావిలో గంబూసియా చేపలు వదులుతున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు కోడిగుడ్ల పూర్ణిమ చేతుల మీదుగా మంగళవారం పలు బావుల్లో గంబూసియా చేపలు విడిచిపెట్టారు. డెంగ్యూ దోమల గుడ్లను ఈ చేపలు తినడం వల్ల దోమల వ్యాప్తి తగ్గుతుందని, అందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. అనంతరం మలేరియా విభాగం అధికారులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి డెంగ్యూపై అవగాహన కల్పించారు. నీళ్లు నిల్వ ఉండే చోట ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీళ్ల ట్యాంకులు, చేపల అక్వేరియంలు, మొక్కల మొదళ్లను తేమ లేకుండా పొడిగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జోన్–5 మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, సూపర్‌వైజర్ సూర్యకుమారి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీఎస్ఎస్ఎన్ ప్రసాద్, అర్జున్, వైభవ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వెళంగిణి రావు, రాజాన శ్రీను, శ్యామ్‌సుందర్, తిరుమల రావు, కమల్‌కుమార్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

## కాలానుగుణంగా నైపుణ్యాల పెంపు అవసరం



రిసోర్స్ పర్సన్స్‌ను సత్కరిస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ డీసీఎంఎస్ విభాగంలో మేక్ యువర్ సెల్ఫ్ కార్పొరేట్ రెడీ అంశంపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తక జ్ఞానంతో పాటు, సాఫ్ట్‌స్కిల్స్, వ్యక్తిత్వం, వ్యవహార శైలి వంటివి ఉద్యోగ సాధనలో ఎంతో కీలకమన్నారు. ఉద్యోగం నిమిత్తం ఇంటర్వ్యూకు వెళ్లే సమయంలో ఆ సంస్థకు సంబంధించిన వివరాలపై అవగాహన ఉండాలని సూచించారు. రూబికన్ సంస్థ ప్రతినిధులు అమర్ నాగేంద్ర, పల్లవి, కోమలి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు.

అనంతరం అతిథులను విభాగం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, మోహన్‌గణేష్, విభాగ ఆచార్యులు ఎస్.సాంబశివరావు, ప్రభాకర్, బి.సుబ్బయ్య, రంజిత్, సెరన్స్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వెంకన్న కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై మంగళవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. చాతుర్మాస్య పూజల్లో ఈ పూజలు చేశారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.